నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంచిర్యాల, ఆదివారం 31 మార్చి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

సోమగూడెం చెక్ పోస్ట్ వద్ద రూ.6.93 లక్షలు సీజ్

కాసిపేట, మార్చి 30 : కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమగూడెం చొప్పరిపల్లి చెక్‌పోస్ట్ వద్ద శనివారం ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. వరంగల్‌కు చెందిన గంట మహేశ్ వద్ద రూ.1,20,700, వరంగల్‌కు చెందిన జరుపుల అమ్రు వద్ద రూ.2,75,000, దండేపల్లికి చెందిన వెంకటేశ్ వద్ద రూ.2,97,500 స్వాధీనం చేసుకున్నారు. నగదును ఎస్ఎస్‌టీ టీంకు అప్పగించినట్లు ఎస్ఐ వివరించారు.

రాపనపల్లి వద్ద రూ. 1.82 లక్షలు

కోటపల్లి, మార్చి 30 : రాపనపల్లి గ్రామం సమీపంలోని అంతర్రాష్ట్ర వంతెన సమీపంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద రూ.1.82 లక్షలను పట్టుకున్నట్లు ఎస్ఎస్‌టీ టీం అధికారి పొన్న మల్లయ్య తెలిపారు. మహారాష్ట్రలోని అంకిస గ్రామానికి చెందిన కొఠారి ధర్మయ్య ఎలాంటి ఆధారాలు లేకుండా మంచిర్యాలకు నగదు తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు వివరించారు.

నగదు స్వాధీనం చేసుకుంటున్న ఎస్ఐ

ఎన్నికల నియమావళిపై అవగాహన ఉండాలి

కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, మార్చి 30 : లోక్‌సభ ఎన్నికల నిర్వహణ, ప్రవర్తనా నియమావళిపై అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌లు రాహుల్, మోతీలాల్, ఆర్డీవో రాములు, ప్రత్యేక ఉప పాలనాధికారి చంద్రకళతో కలిసి ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ రోజు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల విషయంలో ఇబ్బంది తలెత్తినట్లయితే వెంటనే చర్యలు తీసుకోవాలని, ఫారం 12డీ, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

కేంద్రీయ విద్యాలయం పిలుస్తోంది

- ఒకటో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్
- 2 నుంచి 10వ తరగతి దాకా ఖాళీల భర్తీ
- ఏప్రిల్ 1 నుంచి 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాల అర్బన్, మార్చి 30 : కేంద్రీయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను ఒకటో తరగతిలో ప్రవేశాలు, రెండు నుంచి పదో తరగతి దాకా ఖాళీల భర్తీకి కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మానవ వనరుల శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. విద్యా హక్కు చట్టం కింద ఆర్మీ ఉద్యోగులకే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వాటి అనుబంధ సంస్థల ఉద్యోగుల పిల్లలు ఇందులో చేరేందుకు అవకాశాలు కల్పిస్తున్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి 15వ తేదీ వరకు ఒకటో తరగతిలో చేరేందుకు, రెండు నుంచి పదో తరగతుల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు ఏప్రిల్ ఒకటి నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి కేంద్రీయ విద్యాలయం సంఘటన్(కేవీఎస్) నుంచి 64 మంది (సెక్షన్‌కు 32 మంది చొప్పున రెండు సెక్షన్‌లలో) విద్యార్థులను ఎంపిక చేసి ఆ లిస్టును విద్యాలయానికి పంపుతారు. దానిని సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. లిస్టులో ఉన్న వారే తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో విద్యాలయంలో సంప్రదించి అడ్మిషన్ తీసుకోవాల్సి ఉంటుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంచిర్యాల, ఆదిలాబాద్‌లలో మాత్రమే కేంద్రీయ విద్యాలయాలున్నాయి. దరఖాస్తు చేసుకునేందుకుkvsonlinea dmission.kvg.gov.in లేదా kvssan gathan.nic.in ద్వారా లాగిన్ కావాలి.

మంచిర్యాలలోని కేంద్రీయ విద్యాలయం

ఉద్యోగుల పిల్లలకే ప్రాధాన్యత...

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, మాజీ సైనికుల పిల్లలకు మొదటి ప్రాధాన్యత ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ రంగ అనుబంధ సంస్థ (బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ, బ్యాంకు, పోస్టల్ తదితర) ఉద్యోగుల పిల్లలకు రెండో ప్రాధాన్యత ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మూడో ప్రాధాన్యత, రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ సంస్థల (ఆర్టీసీ, ఎన్పీడీసీఎల్, తదితర) ఉద్యోగుల పిల్లలకు నాలుగో ప్రాధాన్యత, మిగిలిన వారికి ఐదో ప్రాధాన్యతగా ప్రవేశాలు కల్పిస్తారు. ఇందులో ఎస్సీ కుటుంబాల పిల్లలకు 15 శాతం (5 సీట్లు), ఎస్టీలకు 7.5 శాతం (2 సీట్లు), ఓబీసీలకు 27 శాతం (8 సీట్లు), విభిన్న రంగాలలో ప్రావీణ్యం ఉన్నవారికి (దివ్యాంగులకు) మూడు శాతం సీట్లు కేటాయిస్తారు. జాతీయ విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ) నిబంధనల మేరకు ప్రతి తరగతిలో ఆర్థికంగా బలహీనంగా ఉన్న కుటుంబాల పిల్లలకు 25 శాతం(8 సీట్లు) ఉచిత బోధన పద్ధతిలో భర్తీ చేస్తారు. లాటరీద్వారా వీరి ఎంపిక ఉంటుంది. ఒకటో తరగతిలో ఆర్ఈటీ కింద ప్రవేశం పొందితే పాఠశాల చదువు పూర్తయ్యే దాకా ఉచిత విద్య ఉంటుంది.

దరఖాస్తుల షెడ్యూల్..

మొదటి నోటిఫికేషన్ (ఒకటో తరగతి విద్యార్థులకు) : ఏప్రిల్ ఒకటో తేదీ ఉదయం 10 గంటల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమై ఏప్రిల్ 15న సాయం త్రం 5గంటల వరకు కొనసాగుతోంది. ఒకటో తరగతి ప్రవేశాలకు మొదటి మెరిట్ లిస్ట్ ఏప్రిల్ 19న, సీట్లు ఖాళీ ఉంటే రెండో మెరిట్ లిస్ట్ ఏప్రిల్ 29న ఉంటుంది. రెండో లిస్టులో సీట్లు ఖాళీ ఉంటే మూడో మెరిట్ లిస్ట్ మే 8న ఉంటుంది.

రెండో నోటిఫికేషన్ (రెండు నుంచి ఇంటర్ విద్యార్థులకు) : రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలకు ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. అదే నెల 15వ తేదీన ఖాళీల లిస్టు ఏర్పాటు చేస్తారు. ఏప్రిల్ 16నుంచి 29వ తేదీ వరకు విద్యార్థుల అడ్మిషన్లు తీసుకుంటారు. ప్రతీ తరగతిలో ఖాళీలను ప్రకటించి నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మెరిట్ జాబితా ఆధారంగా ప్రవేశం ఉంటుంది.

'హస్తం'లో పురాణం చిచ్చు

- సతీశ్ చేరిక సమయంలో కనిపించని జిల్లా అధ్యక్షురాలు
- బీఆర్ఎస్ మంచిర్యాల ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడ్డ మాజీ ఎమ్మెల్సీ
- పీఎస్సార్ కుటుంబానికి చెక్ పెట్టేందుకే చేర్చుకున్నారంటూ ప్రచారం
- అగమ్యగోచరంగా క్షేత్రస్థాయి కార్యకర్తలు, నాయకుల పరిస్థితి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు లేకుండా గడ్డం ఫ్యామిలీ ఆధ్వర్యంలో చేరుతున్న పురాణం సతీశ్

మంచిర్యాల, మార్చి 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ చేరికతో కాంగ్రెస్‌లో కొత్త పంచాయతీ మొదలైందా.. అంటే అవుననే అంటున్నాయి ఆ పార్టీ వర్గాలు. పురాణం సతీశ్ పోయిన ఎన్నికల్లో మంచిర్యాల ఎమ్మెల్యే సీటు ఆశించారు. తనకే టికెట్ వస్తుందని చెప్పుకుంటూ కొన్ని రోజుల పాటు ప్రచారం కూడా చేశారు. కానీ సిట్టింగ్‌లకే టికెట్ ఇస్తామన్న ప్రకటన రావడంతో వెనక్కి తగ్గారు. అలా మంచిర్యాలపై కన్నేసిన నాయకుడిని పార్టీలోకి తీసుకునే ముందు మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావులతో కనీసం చర్చించకుండ చేర్చుకోవడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. పురాణం సతీశ్ కాంగ్రెస్‌లో చేరే కార్యక్రమానికి కొక్కిరాల సురేఖ దూరంగా ఉండడం ఈ చర్చలకు బలం చేకూరుస్తున్నది. ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో జరిగిన పురాణం చేరిక కార్యక్రమంలో చెన్నూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, గడ్డం వినోద్, పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ మాత్రమే పాల్గొన్నారు. దీంతో పురాణం సతీశ్ చేరిక వెనుక గడ్డం కుటుంబమే ఉన్నట్లు స్పష్టం అవుతోంది. మంచిర్యాల జిల్లా కేంద్రంలో పట్టుకోసమే పీఎస్సార్ కుటుంబానికి చెక్ పెట్టడంలో భాగంగానే పురాణాన్ని పార్టీలో చేర్చుకున్నారనే ప్రచారం సాగుతోంది. కాగా, పురాణం సతీశ్‌నే నమ్ముకొని కొన్నేళ్లుగా రాజకీయాల్లో ఉంటూ వస్తున్న ఆయన అనుచరులు, నాయకుల పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా మారింది. స్థానిక ఎమ్మెల్యే సపోర్ట్ ఉన్నా జిల్లా అధ్యక్షుల అండదండలు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యం దొరకడం కష్టమని చాలా మంది ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పురాణం వెంట వెళ్లి హస్తం పార్టీలో చేరడమా.. లేదా అని ఎటూ తేల్చుకోలేకపోతున్నారు.

నల్లాల ఓదెలుకు ఏం చెప్తారు..

చెన్నూర్ నియోజకవర్గంలో మరో సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఆయన సతీమణి జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగలక్ష్మిలకు పురాణం చేరికతో వారి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. అటు నల్లాల ఓదెలు కుటుంబాన్ని, ఇటు పురాణం సతీశ్ ఇద్దరిని సంతృప్తి పరచడం సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. ఓదెలు కాంగ్రెస్‌లో చేరి చెన్నూర్ ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. అసలు టికెట్ కోసమే ఆయన ఆ పార్టీలో చేరారు. కానీ చివరి నిమిషంలో గడ్డం వివేక్ టికెట్‌ను ఎగరేసుకుపోయారు. నల్లాల ఓదెలును కలిసి బుజ్జగించుకున్నారు. కానీ ఇప్పుడు పురాణం సతీశ్ పార్టీలోకి చేర్చుకున్న గడ్డం ఫ్యామిలీ గతంలో ఓదెలు కుటుంబానికి ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటుందా.. ఓదెలు ఉండగా, పురాణంను పార్టీలో చేర్చుకోవాల్సి అవసరం ఏమొచ్చిందనే చర్చ జోరుగా సాగుతున్నది. ఒక రకంగా నల్లాల ఓదెలు వర్గానికి ఇది నచ్చడం లేదనేది విశ్వసనీయ సమాచారం. కాగా, పురాణం చేరికపై ముందు నుంచి కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తున్న నాయకులు గుర్రుగా ఉన్నట్లు సమాచారం. ఎమ్మెల్యే టికెట్ గడ్డం వివేక్‌కు, ఎంపీ టికెట్ గడ్డం వంశీకి ఇచ్చిన అధిష్టానం నామినేటెడ్ పదవుల కోసమైనా తమ పేర్లను పరిశీలిస్తుందన్న ఆశతో ఉన్నామని.. ఇప్పుడు ఆ పదవులు కూడా గడ్డం ఫ్యామిలీ పార్టీలోకి తీసుకువచ్చిన పురాణం లాంటి వాళ్లకు ఇస్తే తమ పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. మొన్నటి వరకు కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించి, ఆ పార్టీకి వ్యతిరేకంగా పని చేసిన సతీశ్ చేరికను పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్ నాయకులు సైతం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గడ్డుకాలం తప్పదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఓటు హక్కు వినియోగంపై నిర్వహించిన 5కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్,అదనపు కలెక్టర్

- పోలింగ్ శాతం పెంచేందుకు విస్తృతంగా ప్రచారం చేయాలి
- ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో 5కే రన్

ఆసిఫాబాద్,మార్చి 30 : లోక్ సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు స్వీప్ ఆక్టివిటీస్‌లో భాగంగా చేపట్టిన 5కే రన్ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి ప్రారంభించారు. అంబేద్కర్ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ భారత పౌరులకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఎంతో విలువైనదన్నారు. ఓటును సక్రమంగా వినియోగించుకొని అభివృద్ధికి పాటుపడే నాయకత్వాన్ని ఎన్నుకోవాలని సూచించారు. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు కళాజాత ప్రదర్శన, ఇంటింటి ప్రచారం విస్తృతంగా నిర్వహించాలన్నారు. ఏప్రిల్ 1, 2024 తేదీని ప్రామాణికంగా తీసుకొని 18 ఏళ్లు నిండిన వారంతా 15వ తేదీలోగా తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినట్లయితే టోల్ ఫ్రీ నం.1950, సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం ఓటుపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సదయ్య, డీఆర్‌డీవో సురేందర్, నోడల్ అధికారులు, జిల్లా అధికారులు, యువతీ యువకులు, విద్యార్థిని, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తారామణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ రావు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ నరసింహారావుతో కలిసి సహకార, ఐకేపీ, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో 37 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, వేసవి దృష్ట్యా రైతులకు తాగునీరు, నీడ సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. వరి ధాన్యం కొనుగోలుకు అవసరమైనన్ని గన్ని సంచులతో పాటు టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేటప్పుడు తప్ప, తాలు, మట్టి గడ్డలు, తేమ శాతం ఇతరత్రా అంశాలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. ధాన్యం రవాణా సమయంలో ఎగుమతి, దిగుమతుల కోసం అవసరమైన హమాలీలను అందుబాటులో ఉంచాలని, తరలింపు ప్రక్రియ వేగవంతంగా జరిగేలా అధికారులు, రైస్ మిల్లుల యజమానులు సమన్వయంతో వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, వ్యవసాయ, విస్తరణ, సహకార శాఖల అధికారులు, ఐకేపీ అధికారులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతు దీక్షకు మద్దతు

- పెద్దపల్లిలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో 36 గంటల నిరసన ప్రారంభం
- సంఘీభావం తెలిపిన మాజీ విప్ బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు
- జిల్లా నలుమూలల నుంచి తరలిన శ్రేణులు, రైతులు

రైతు దీక్షలో కూర్చున్న మాజీ విప్ బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి (నమస్తే తెలంగాణ)/ మంచిర్యాల టౌన్, మార్చి 30 : బీఆర్ఎస్ వ్యవస్థాపకుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన 36 గంటల రైతు నిరసన దీక్షకు మాజీ విప్ బాల్క సుమన్, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మద్దతు తెలిపారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్ వంద రోజుల పాలనతో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారన్నారు. రైతులు నీటి కోసం, కరెంటు కోసం రోడ్ల మీదికి వచ్చి ధర్నాలు చేయాల్సిన దుస్థితికి తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లందక రైతులు కన్నీరు పెట్టుకుంటుంటే ఈ సర్కారు ఏ మాత్రం చలించడం లేదని మండిపడ్డారు. సాగు నీరందక ఎండిన పంటలకు ఎకరాకు రూ.25 వేల పరిహారం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. మాజీ విప్ బాల్క సుమన్ మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తన పాలనలో ఎక్కడా ఒక్క ఎకరం కూడా ఎండనివ్వలేదని, రైతులకు మేలు కలిగేలా సాగు నీటి కోసం ప్రాజెక్టులను నిర్మించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో కరువు పరిస్థితులు వచ్చాయని, సాగునీరందక రైతులు రోడ్డెక్కుతున్నప్పటికీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పత్తా లేకుండా పోయారన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రివా.. లేక రాక్షసుడివా.. ఓట్లేసిన ప్రజల పేగులు మెడలో వేసుకుంటావా..? అని ప్రశ్నించారు. ఇలాంటి కాంగ్రెస్‌ను పార్లమెంటు ఎన్నికల్లో పాతరేయాలని, ఒక్కసీటు కూడా ఇవ్వకుండా బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతుల జీవితాలను ఆగం చేస్తున్నదని, పంటలకు నీళ్లివ్వాలన్న ఆలోచన లేకుండా బీఆర్ఎస్‌పై బురద జల్లడమే పనిగా పెట్టుకుందని, ఇచ్చిన హామీలనుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే రోజుకో అంశాన్ని తెరపైకి తీసుకువచ్చి కాలయాపన చేస్తున్నదని మండిపడ్డారు. సీనియర్ నాయకుడు గోగుల రవీందర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

కదిలి వచ్చిన కర్షకలోకం

ఎండుతున్న పంటలను కాపాడి రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన '36 గంటల రైతు నిరసన దీక్ష'కు జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి కర్షకలోకం కదిలి వచ్చింది. కాంగ్రెస్ సర్కార్‌కు వ్యతిరేకంగా నినదించారు. కొంత మంది రైతులు తమ పొలాల్లో ఎండిన వరిని తీసుకొచ్చి నిరసన తెలిపారు. ప్రభుత్వం తక్షణమే దిగి వచ్చి రైతులను ఆదుకోవాలని, రైతును కన్నీరు పెట్టిస్తున్న రేవంత్ సర్కార్ తక్షణమే గద్దె దిగాలని ముక్తకంఠంతో నినదించారు. కాగా, దీక్షలో అనేక సార్లు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.



కొప్పుల ఈశ్వర్ దీక్షకు మద్దతు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

నేరాల నియంత్రణకు కృషి చేయాలి

రామగుండం సీపీ శ్రీనివాస్

పోలీసు అధికారులతో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

మంచిర్యాల ఏసీసీ, మార్చి 30 : సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల నియంత్రణకు కృషి చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ ఆదేశించారు. శనివారం రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని డీసీపీ అశోక్ కుమార్, ఏసీపీ ఆర్ ప్రకాశ్‌తో కలిసి యూఐ, గ్రేవ్ యూఐ లాంగ్ పెండింగ్ కేసుల పరిష్కారం, ఎస్సీ, ఎస్టీ, విమెన్ అగైనెస్ట్, పీఓసీఎస్‌వో, ఎన్‌డీపీఎస్‌యాక్ట్, ఎన్‌హెచ్ఆర్‌సీ, ఎస్‌హెచ్ఆర్‌సీ కేసుల పరిష్కారం, మహిళా కమిషన్‌కు సంబంధించిన అప్పీల్ పిటిషన్ పెండింగ్‌లపై సమీక్ష నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ సమగ్ర సాక్ష్యాధారాలతో నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలన్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని, పోక్సో, ఎస్సీ, ఎస్టీ గ్రేవ్ కేసులను త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ చేసి 60 రోజుల్లో పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ వేయాలని సూచించారు. ప్రతి కేసులో పారదర్శకంగా కేసును ఇన్వెస్టిగేషన్ చేయాలని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ ఆధారాలతో దర్యాప్తు చేయాలన్నారు. ఫిర్యాదులు, ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలని ఆదేశించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాశ్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ముగిసిన 'పది' పరీక్షలు

కేరింతలు కొడుతూ సందడి చేసిన విద్యార్థులు

మంచిర్యాలలో ఎగిరి గంతేస్తున్న విద్యార్థినులు

ఆసిఫాబాద్ : పరీక్షలు రాసిన అనంతరం విజయకేతనం చూపిస్తున్న విద్యార్థినులు

మంచిర్యాల అర్బన్/ఆసిఫాబాద్, మార్చి 30 : పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారంతో ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 52 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, చివరి రోజు పరీక్షకు 99.75 శాతం మంది హాజరయ్యారు. 9,303 మంది విద్యార్థులకుగాను 9,280 మంది పరీక్ష రాసినట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 9,298 మందికిగాను 9,275 మంది పరీక్ష రాశారు. గతంలో ఫెయిలైన విద్యార్థులు ఐదుగురు ఉండగా, అందరూ హాజరయ్యారు. డీఈవో యాదయ్య, ఏసీజేఈ, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పలు కేంద్రాలను సందర్శించారు. ప్రధాన పరీక్షలు ముగియగా, జిల్లాలోని 10 కేంద్రాల్లో వొకేషనల్ విద్యార్థులకు పరీక్ష ఉండనున్నది. ఇక ఆసిఫాబాద్‌లో పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించారు. మొదటి రోజు జిల్లాలో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయ్యారు.

కేరింతలు కొట్టిన విద్యార్థులు..

పరీక్షలు ముగియడంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ సందడి చేశారు. సెల్ఫీలు దిగుతూ ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకొని వీడ్కోలు చెప్పుకున్నారు. కొందరు సమీప జ్యూస్ సెంటర్లు, హోటళ్లకు వెళ్లి సరదాగా గడిపారు. పరీక్షలు రాసిన తీరుపై చర్చించుకున్నారు. తర్వాత ఏం చేయాలనే విషయాలపై మాట్లాడుకోవడం కనిపించింది.